క్లుప్తంగా

ఆనందోత్సాహాలతో హోలీ



మొవ్వ: ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమిని పురస్కరించుకుని మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారు, పెద్దలు అనే తేడా లేకుండా హోలి వేడుకలు సోమవారంగా ఘనంగా నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఈ ఏడాది ప్రజల్లో అవగాహన పెరగటంతో రసాయనాలతో తయారు చేసిన రంగులకు బదులుగా హెర్బల్స్‌తో తయారు చేసిన రంగులకే ప్రాధాన్యం ఇచ్చారు.

ప్రత్యేక పూజలు



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కొత్తా వీరయ్య మాట్లాడుతూ స్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు టీవీ సుబ్బారావు, సీబీఎల్ నాగేశ్వర రావు, కె.సాంబశివరావు, కొల్లిపర సాయి, ఆనంద్, అర్చకుడు ఎంవీ కృష్ణన్ పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష గాజులతో అలంకరణ



గుడివాడ టౌన్: స్థానిక బేతవోలులోని శ్రీ గంగాపార్వతీ సమేత ఆనందేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం స్వామిని విభూది అలంకరణతో, అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మామిళ్లపల్లి ఫణిభాస్కర శర్మ మాట్లాడుతూ ఫల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని బేతవోలు శ్రీ లలితా మండలి సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారిని లక్షగాజులతో అలంకరించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని, అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శిరీష, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు ఆంజనేయదాసు, శ్రీ లలితా పారాయణ మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రథోత్సవం ఘనంగా జరిగింది. తొలుత అర్చకులు ఆసూరీ రంగనాథాచార్యులు, నృసింహాచార్యుల ఆధ్వర్యంలో గరుడోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు రథంపై అలంకరింపజేసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల సందర్భంగా భాగవతుల సీతారామశర్మ ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పెడన మండలం చెన్నూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన జరిగింది.

కొండలమ్మ సన్నిధిలో పూజలు



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయ ప్రాంగణంలో పౌర్ణమి ప్రత్యేక పూజలను సోమవారం వేద పండితులు నిర్వహించారు. అనంతరం చండీ హోమాన్ని చేపట్టారు. పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారి భక్తుల సర్వ శ్రేయస్సు, ఆయురారోగ్యా ఐశ్వర్య అభివృద్ధికి ఈ హోమాన్ని చేపట్టారు. ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

కైకలూరు: స్థానిక పెద్ద మసీదు వెనుక పశువుల పాక, గడ్డివాము సోమవారం దగ్ధమైంది. తిరుమల సత్యనారాయణకు చెందిన గడ్డివాము నుంచి మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపకశాఖ కార్యాలయానికి ఫోన్ చేశారు. సిబ్బంది మంటలను అదుపుచేసి ఆవు, రెండు గేదెలను రక్షించారు.

భక్తి పారవశ్యం.. కూచిపూడి నాట్యాంశాలు



శ్రీవల్లి శిష్య బృందం ప్రదర్శన



దొడ్డా బాలజీ శిష్య బృందం నాట్యప్రదర్శన



కూచిపూడి(మొవ్వ): నాట్యక్షేత్రం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కళావేదికపై జరుగుతున్న కూచిపూడి నాట్య ప్రదర్శనలు పండితులు, పామరుల మన్ననలు అందుకుంటున్నాయి. కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పు అయిన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామి వార్ల 261 వార్షిక కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని సాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు సోమవారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. కైకలూరుకు చెందిన కూచిపూడి నాట్యరవళి కేంద్ర నాట్యాచారిణి పసుమర్తి శ్రీవల్లి విద్యార్థులు ప్రదర్శించిన మూషిక వాహన.. వినాయకొత్వాన్ని అంశాలకు చిన్నారి కళాకారులు చిన్న చిన్న అడుగులతో నయనానందకరంగా ప్రదర్శించి ప్రేక్షకుల ఆదరణ అందుకున్నారు. హైదరాబాదుకు చెందిన సత్యకీర్తి కూచిపూడి నృత్యధామం నాట్యాచార్యులు దొడ్డా బాలాజీ శిష్యులు దశావతార శబ్దాన్ని, దేవి స్తుతిని, ఎందరో మహానుభావులు అనే త్యాగరాజ కీర్తనను ప్రదర్శించి ఆహూతులను భక్తి పారవశ్యంలోకి తీసుకెళ్లారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రత్తయశర్మ శిష్యులు కేరళకు చెందిన కళాకారులు కార్తీక, మాధవి, కావ్య హరీష్ మింటు, శ్రీ రేఖ, శ్రీధరన్ గణేష కొత్వమ్, పూజా నృత్యం, జతీశ్వరం, దశావతార శబ్దాలకు చక్క హావ భావాలతో.. వేగవంతమైన కదలికలతో లయకు తగ్గ అడుగులు వేసి ప్రదర్శనలను రక్తి కట్టించారు.

అగ్ని ప్రమాద బాధితుడికి మెరుగైన వైద్యం



ఎమ్మెల్యే కొడాలి నానికి సమస్యను వివరిస్తున్న బాధితుడి కుటుంబ సభ్యులు

గుడివాడ టౌన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న వ్యక్తి అగ్నిప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన వ్యక్తిని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని, మెరుగైన వైద్య సేవలు అందేందుకు వైద్యులకు సూచించాలని కుటుంబ సభ్యులు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని సోమవారం కోరారు. స్పందించిన కొడాలి నాని ఆస్పత్రి వైద్యులతో సంప్రదించి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. వైద్యం విషయంలో కుటుంబ సభ్యులు అధైర్యపడాల్సిన పనిలేదని అవసరమైతే ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో సేవలందించేలా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ప్రతిపక్షాలను తరిమికొడదాం



బొమ్మినంపాడులో పార్టీలో చేరిన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: పేదల కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రి జగనన్నను అధికార పీఠం నుంచి దింపేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రతిఒక్కరూ సమాయత్తం కావాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని బొమ్మినంపాడులో ప్రజాఆశీర్వాదయాత్ర పేరుతో సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలు పార్టీల నేతలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు చేస్తున్న అసత్య ప్రచారాలు, కుయుక్తులను ఎలాంటి పరిస్థితుల్లో నమ్మవద్దని పార్టీలో చేరిన కార్యకర్తలను హెచ్చరించారు. నవరత్నాల పేరుతో ప్రతి పేదకుటుంబంలో వెలుగులు నింపుతున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గోరింకల గంగరాజు, ఎంపీటీసీ దాసరి అరుణకుమారి ఆధ్వర్యంలో 100 మంది టీడీపీ, ఇతర పార్టీలకు చెందిన నేతలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ కండువాలు కప్పి పార్టీలో స్వాగతం పలికారు. పార్టీలో చేరిన ప్రముఖుల్లో బొడ్డు బాలకృష్ణ, దండే భార్గవ్, వాసిపల్లి నాగబాబు, వాసిపల్లి బావయ్య, పిల్లం అమరబాబు, దాసి భవన్, దాసిన మహేష్, దండే నరసింహ, దాసి ఉదయ కిరణ్, గడిదేశి కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



వీర రాఘవాచారిని సత్కరిస్తున్న భారతీ సమితి కార్యవర్గ సభ్యులు

గుడివాడ టౌన్: సమాజ శ్రేయస్సుకు ఆధ్యాత్మిక చింతన అవసరమని విశ్రాంత ఉపాధ్యాయుడు వంగిపురపు వీర రాఘవాచారి అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని ఆనంద్ ఫంక్షన్ హాల్లో సోమవారం భారతీ సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీర రాఘవాచారి 'నిత్య జీవితంలో ఆధ్యాత్మికత' అనే అంశంపై ప్రసంగించారు. సామాజిక రుగ్మతలు నిరోధించేందుకు ఆధ్యాత్మిక భావాలు, విలువలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఇటువంటి విలువలు పెంపొందాలంటే బాల్యం నుంచే వీటి అభ్యాసనం అవసరమన్నారు. భారతీయ ఇతిహాస గ్రంథాలైన రామాయణం, మహాభారతాలు ఆధ్యాత్మిక విలువలతో అనుసంధానమైన నైతిక విలువలు బోధిస్తాయన్నారు. అనంతరం వీరరాఘవాచారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భారతీ సమితి అధ్యక్షుడు డీఆర్‌బీ ప్రసాద్, కార్యదర్శి బండారు శ్యాంకుమార్, కోశాధికారి అవిర్నేని వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి చోడవరపు రూప, పీవీ సత్యనారాయణ, మట్టా రాజా, కోగంటి గాంధీ బాబు, వసుధ బసవేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సీఎం జగన్ పాలన



చిన తాడినాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న శ్రీఅనుపమ

కలిదిండి: జగన్ మోహన్ రెడ్డి పాలనలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వచ్చిందని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు శ్రీఅనుపమ అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా చిన తాడినాడలో సోమవారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వర రావు, జెడ్పీటీసీ బి.సత్యవతి, సర్పంచ్ గండికోట ఏసుబాబు, ఏఎంసి చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని రమేష్, మాజీ ఏఎంసి చైర్మన్ అయినాల బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి గెలిపించండి



రాచపట్నంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి

కైకలూరు: గ్రామాల్లో పార్టీలు చూడకుండా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అందరికీ అభివృద్ధి పనులు చేశారని, మరో పర్యాయం గెలిపించాలని ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి అన్నారు. రాచపట్నంలో ఎన్నికల ప్రచారాన్ని ఆమె సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, గ్రామ సర్పంచ్‌లు అల్లూరి మంగారావు, ఉప్పలపాటి నాగమణి, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ కార్యదర్శి గోర్రెముచ్చు పాట్రిక్‌పాల్, ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణవేణి, నాయకులు కన్నా రమేష్ సాదిరెడ్డి నారాయణ పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

పామర్రు: ఎండోమెంట్ పొలంలో మట్టి తవ్వకాలను నిర్వహించారని, దీనిపై సంబంధిత వ్యక్తులపై ఫిర్యాదు చేసినట్లు పామర్రు గ్రూప్ ఆఫ్ ఆలయాల మేనేజర్ కందుల వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పామర్రు విజయవాడ రోడ్డులోనిపెట్రోల్ బంక్ ఎదురుగా శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధించిన 5.93 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ఆ భూమిని మూడేళ్ల కాల పరిమితికి హెచ్చు పాటదారుడైన వల్లభనేని వెంకటరత్నంకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆ పొలంలో ఈ నెల 24వ తేదీ రాత్రి అక్రమంగా మట్టి తరలించుకుపోయారని, ఈ విషయమై తగువిధమైన చర్యలు తీసుకుని ఆలయానికి న్యాయం చేయాలని కోరుతూ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రేపటి నుంచి ఎన్నికల ప్రచారం

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తన ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కార్యాలయ ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని ఒకటో వార్డు నుంచి ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఈ ప్రచారం ప్రారంభమవుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

11 కేవీ వైర్లు కాలి రూ. 2 లక్షల నష్టం

మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడులో ఆదివారం రాత్రి చేపల చెరువుల వద్ద గాలికి రొయ్యల చెరువులకు చెందిన 11 కేవీ వైర్లు కాలి రైతులకు సుమారు రూ. 2 లక్షలు నష్టం వాటిల్లినట్లు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు తెలిపారు. సమీపంలో ఉన్న డ్రెయిన్‌లోని కిక్కిస కారణంగా మంటలు మరింత వ్యాపించాయని పేర్కొన్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

మండవల్లి: మండలంలోని అయ్యవారిరుద్రవరం డొంకలో సోమవారం చిత్తులాట ఆడుతున్న 10 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 11,900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్ రామచంద్రరావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, సొంత పూచీకత్తు మీద విడుదల చేసినట్లు తెలిపారు.

బాపనయ్యకు ఘన నివాళి

గుడివాడ టౌన్: ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ గుంటూరు బాపనయ్య వర్ధంతి సోమవారం జరిగింది. స్థానిక సీపీఎం కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పార్టీకి ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, నీలం మురళీకృష్ణా రెడ్డి, సీహెచ్ నాగేశ్వరారావు, జి. గోపాల్, అవిర్నేని వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ఎలీషారావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆత్మీయ సమావేశం

మండవల్లి: మండలంలోని లోకుమూడి దత్తాశ్రమంలో కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమావేశం జరిగింది. గౌడ సంఘ రాష్ట్ర వైస్ చైర్మన్ పోసిన చెంచు రామారావు, బొర్రా చెలమయ్య మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో గౌడ సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందన్నారు. పోసిన పాపారావు గౌడ్, పరసా ఏడుకొండలు, వీరమల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజా ఆశీర్వాద యాత్రలు

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 27 నుంచి ప్రజా ఆశీర్వాద యాత్రలు జరుగుతాయని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని, 27న కానుకొల్లు, 31న కొర్లపాడు, లింగాల, అల్లినగరం, ఏప్రిల్ 4న గన్నవరం, మొఖాసాకలవపూడి, సింగనపూడి, 8న నుచ్చుమిల్లి, తెక్కళపాడు, మూడుతాళ్లపాడు, 13న పుట్లచెరువు, చింతలపూడి, పసలపూడి గ్రామాల్లో ప్రజా ఆశీర్వాదయాత్రలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా నాగేశ్వరస్వామి కల్యాణోత్సవం

నెమ్మలూరు(పామర్రు): మండలంలోని నెమ్మలూరు గ్రామంలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ నాగేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ త్రయాహ్నిక దీక్షతో మహోత్సవాలను నిర్వహించామన్నారు. ఆదివారం కల్యాణోత్సవం సందర్భంగా జైశ్రీ నాట్యమండలివారిచే కొడాలి రాజశేఖర్ సమర్పించు సత్య హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. సోమవారం ఉదయం పూర్ణాహుతి, వసంతోత్సవం, రాత్రికి స్వామి ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, అనంతరం పవళింపు సేవ నిర్వహించామని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గరికపర్రులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని గరికపర్రులో ఆయన సోమవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దక్షిణ, ఉత్తర ఎస్సీ వాడ, బీసీ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామస్తులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను ఆరా తీశారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు ద్వారా దేశంలోనే ఆదర్శ పాలనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను తీసుకురావడం ద్వారా దశాబ్దాలుగా ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగినట్లయిందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే అవ్వాతాతలకు పెన్షన్ అందించిన ఘనత జగనన్నదేనన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టడం ద్వారా నూతన ఒరవడికి నాంది పలికారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమం కోసం ఇంతలా పాడుపడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేయటం ద్వారా ఎమ్మెల్యేగా తనను, బందరు ఎంపీగా సింహాద్రి చంద్రశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అనిల్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోర్ల రామచంద్రరావు, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం చంటి, నాయకులు మద్దిరెడ్డి శేషిరెడ్డి, చింతలపూడి గవాస్కర్‌రాజు, గాదె సురేంద్ర రెడ్డి, వీరంకి రాము, ఊకోటి పరశురామయ్య, వేమూరి కృష్ణబాబు పాల్గొన్నారు.

సమాజ సేవకులకు అవార్డులు



అవార్డులను అందుకుంటున్న సేవకులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరుకు చెందిన సమాజ సేవకులకు హైదరాబాదు రవీంద్రభారతిలో ఆదివారం వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారీశక్తి, ఇయర్ ఆఫ్ సోషల్ సర్వీస్ ఐకానిక్, జీసీఎస్ బంగారు అవార్డులను అందించారు. ఈ విషయాన్ని సోమవారం విలేకరులకు ప్రముఖ సంఘ సేవకుడు కొల్లిపర పార్థసారథి తెలిపారు. ఈ అవార్డులను అందుకున్న వారిలో హై 5 యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జి.నాగబాబు, గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ, డైరెక్టర్ బి.దేవసహాయం, ఎం.కొండలయ్య, జై భీమ్ యువజన సంఘ స్టేట్ కన్వీనర్ గుమ్మడి నాగరాజు ఉన్నారని పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందు ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న జహీర్‌భాయి

పామర్రు: రంజాన్ మాసం సందర్భంగా జమాఅతే ఇస్లామీ మహిళా విభాగం ఇఫ్తార్ విందును సోమవారం పామర్రులో ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఇఫ్తార్ కలయిక మత సామరస్యానికి వేదికగా నిలుస్తుందని విజయవాడకు చెందిన ప్రముఖ వక్త, జమాఅతె ఇస్లామీ సభ్యులు జహీర్‌భాయి అన్నారు. రంజాన్‌మాసంలో బీద సాదల పట్ల సానుభూతి చూపించాలన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు, సెల్ఫీలు, కానుకలు ఇచ్చి పుచ్చుకోవడం వంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి యూనుస్ అధ్యక్షత వహించగా ప్రముఖ వైద్యురాలు రొంపిచర్ల భార్గవి, స్థానికులు బీఏఎం లాజరస్, డాక్టర్ ఆర్‌కే విశాలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధిలో మనకు పోటీ లేరు



వైఎస్సార్ గ్రీన్ విలేజ్‌లో ఎమ్మెల్యే డీఎన్నార్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

కైకలూరు: నియోజకవర్గ అభివృద్ధిలో మనకు పోటీ ఎవరూ లేరని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. గుడ్ మార్నింగ్ కైకలూరు పేరుతో 23 రోజులుగా సాగుతున్న కార్యక్రమం వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ పర్యటనతో సోమవారం ముగిసింది. చివరి రోజు గ్రీన్ విలేజ్‌లో పర్యటించినప్పుడు నూతనంగా నిర్మించుకున్న ప్రతి గృహం నుంచి మహిళలు వచ్చి ఎమ్మెల్యేకు నీరాజనాలు పట్టారు. తమకు స్థలం ఇవ్వడమే కాకుండా ఇంటి నిర్మాణానికి సాయం చేశారని ఆయనను సన్మానించారు. తిరిగి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా డీఎన్నార్ రావాలని ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీన్ విలేజ్‌లో 3000 పైగా పేదలకు పార్టీలు చూడకుండా ఇంటి స్థలాలు కేటాయించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు రఫీ, పాట్రిక్‌పాల్, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, నాయకులు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, బూరుబోయిన మోహనరావు, మెండ సురేష్ బాబు, తలారి అన్నిబాబు, బిరుదుగడ్డ లాజర్, నిమ్మల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి జన్మదినోత్సవం

పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలోని అయ్యప్ప స్వామికి జన్మదినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామికి పంచామృతాలతో నవరసాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. తొలుత స్థానికులు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం ఇంటి వద్దనుంచి స్వామిని పూజాసామగ్రిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయంలో విశేషంగా పూజాధికాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు, కోటి పాండురంగారావు పాల్గొన్నారు

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అయ్యప్పస్వామి జన్మదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 27 రకాల పూజా ద్రవ్యాలతో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య చలపతి గురుస్వామి, శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం చేశారు.

అలరించిన గానామృతం

మచిలీపట్నంటౌన్: గొడుగుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నిత్య ఔపోసన, బలిహరణ, విశేష అర్చనలు, హోమం నిర్వహించారు. అవభృదోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి, కుంభ దేవారోపణం చేశారు. సాయంత్రం ఓలేటి గీతాపరమేశ్వరరావు బృందం నిర్వహించిన శ్రీనివాసకళ్యాణ గానామృతం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేవీ గోపాలరావు, ఆలయ కమిటీ సభ్యుడు నూకల ప్రసాద్ పర్యవేక్షించారు. మంగళవారం రాత్రి స్వామివారికి శ్రీ పుష్పయాగోత్సవం, పవళింపు సేవ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com